క్లుప్తంగా

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



కూచిపూడి నృత్యంతో అలరించిన విద్యార్థులు

దాబాగార్డెన్స్: నాట్య దీపిక కూచిపూడి అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. దాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించిన అకాడమీ వ్యవస్థాపకురాలు ఎల్. ఇంద్రాణి నరేంద్ర నేతృత్వంలో చేపట్టిన విద్యార్థుల ప్రదర్శన పలువుర్ని అలరించింది.

21 కిలోల గంజాయి స్వాధీనం

సీతమ్మధార : పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఫోర్త్ టౌన్ పోలీసులు రైల్వేస్టేషన్ పరిధిలో తనిఖీలు నిర్వహించారు. సీఐ, ఎస్.వి జయకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది రైల్వేస్టేషన్ ఆవరణతో పాటు స్టేషన్ బయట బస్టాప్ ప్రాంతంలో తనిఖీలు చేస్తుండగా ఒక బ్యాగ్ కనిపించింది. చుట్టు పక్కల చూస్తే ఎవరూ లేకపోవటంతో సీఐ తన సిబ్బందితో బ్యాగు తెరిచి చూడగా గంజాయి ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

కమనీయం శ్రీకృష్ణ లీలలు నాటకం



శ్రీకృష్ణ లీలలు నాటకంలో సన్నివేశం

మద్దిలపాలెం : సురభి శ్రీకృష్ణ లీలలు నాటకం ప్రతి సన్నివేశం ఎంతో అద్భుతంగా సాగింది. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఐదో రోజు శ్రీకృష్ణలీలలు నాటకాన్ని ప్రదర్శించారు. కథానుగుణంగా పాత్రదారులు వారి నటనతో అందరి అలరించారు. సన్నివేశాలకు తగ్గట్టుగా పద్యాలు ఆలాపించి అకట్టుకున్నారు. అద్యంతం నాటకం కమనీయంగా సాగింది. ఈ కార్యక్రమానికి విశ్రాంత లేబర్ కమిషనర్ డీఆర్‌కే రావు, హైకోర్టు న్యాయవాది కేఆర్ రావు, బడే ప్రభాకర్ తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. రంగసాయి నాటక సంఘం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి నేతృత్వంలో ప్రదర్శించారు. నాటకం సినిమాను తలపించేలా ఉందని ప్రేక్షకులు ప్రశంసలు కురిపించారు.

బాల్య వివాహాలపై కళాజాత

గాజువాక: బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన కళాజాత అందర్నీ ఆకట్టుకుంది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 66వ వార్డు అజీమాబాద్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద గురువారం కళాజాత నిర్వహించారు. కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణులు, మహిళలకు బాల్య వివాహాలవల్ల తలెత్తే ఇబ్బందులను కళాకారులు ఆట, పాటల ద్వారా వివరించారు. బాలల హక్కులు, చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందించే పౌష్టికాహారం తదితర అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.కె.మునీరా బేగం, ఎంఎస్ఏకే ప్రవీణ, కళాజాత సభ్యులు, డ్వాక్రా మహిళలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయానికి గండి

- దాదాపు ఆరేళ్లుగా జారీ చేయని ట్రేడ్ లైసెన్సులు
- అలాగే కొనసాగుతున్న రామకృష్ణా రైతుబజార్ వ్యాపారులు
- జీవీఎంసీకి రూ. లక్షల్లో నష్టం

పూర్ణామార్కెట్ తర్వాత పెద్ద మార్కెట్‌గా పేరు తెచ్చుకున్న రామకృష్ణా రైతుబజార్ అనేక సంవత్సరాలుగా ప్రజలకు సేవలందిస్తోంది. ఈ మార్కెట్ ద్వారా ఎంతో మంది వ్యాపారులు జీవనోపాధి పొందుతున్నారు. వారి సౌలభ్యం కోసం దాదాపు ఆరేళ్ల క్రితం 152 దుకాణ సముదాయలతో కూడిన మార్కెట్‌ను జీవీఎంసీ నిర్మించి అందజేసింది. అంతా బాగానే ఉంది. కానీ వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్‌లు మాత్రం జారీ చేయలేదు. దీనివల్ల జీవీఎంసీ లక్షల్లో ఆదాయం నష్టపోతోంది. అంతే కాకుండా మార్కెట్‌లో కనీస సదుపాయాలు లేవని.. తమకు కేటాయించిన దుకాణాలను వ్యాపార అవసరాలకు అనుగుణంగా మార్చుకోవడానికి వీల్లేకుండా పోయిందని వ్యాపారులు వాపోతున్నారు. జీవీఎంసీ ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేస్తే దుకాణాలకు చిన్నచిన్న మార్పులు చేసుకుంటామని వ్యాపారులు చెబుతున్నారు.



వసతులు లేని మార్కెట్‌లో దుకాణాలు



రామకృష్ణా రైతుబజార్

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 రెవెన్యూ విభాగం దాదాపు ఆరేళ్లుగా ఆదాయం కోల్పోతుంది. ఇక్కడి 35వ వార్డు రామకృష్ణా రైతుబజార్‌లో జీవీఎంసీ రూ. 5 కోట్లు వెచ్చించి 152 దుకాణ సముదాయాలను నిర్మించింది. వాటిని అక్కడి వ్యాపారులకు సుమారు ఆరేళ్ల కిందట అప్పగించింది. అక్కడ వ్యాపారులు తోచిన వ్యాపారం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. అయితే అధికారులు మార్కెట్‌లోని వ్యాపారులకు ట్రేడ్ లైసెన్సులు ఇవ్వకపోవటంతో జీవీఎంసీకి లక్షల్లో నష్టం వాటిల్లుతోంది. పూర్ణామార్కెట్ తర్వాత దక్షిణంలో అంతటి మార్కెట్‌గా పేరు తెచ్చుకున్న రామకృష్ణా రైతు బజార్‌లో నిత్యం లక్షల్లో వ్యాపార లావాదేవీలు జరుగుతుంటాయి. ప్రతి చిన్న వ్యాపారానికి ట్రేడ్ లైసెన్స్‌లు ఉండాలని చెప్పే జీవీఎంసీ అధికారులు ఇన్నేళ్లుగా రామకృష్ణా రైతుబజార్‌కు ఎందుకు మినహాయింపు ఇచ్చారో తెలియటం లేదని పలువురు చెబుతున్నారు. ఏదేమైనా లక్షల్లో లావాదేవీలు జరుగుతున్న ఈ మార్కెట్ వ్యాపారులకు ఇప్పటికైనా ట్రేడ్ లైసెన్స్‌లు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

కనీస సదుపాయాలకు దూరంగా..

జీవీఎంసీ అధికారులు రైతుబజార్ నిర్మించి తమకు ఇచ్చారు కానీ మార్కెట్‌లో కనీస సదుపాయాలు లేవని వ్యాపారులు వాపోతున్నారు. దుకాణాలకు షట్టర్లు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల వంటి సదుపాయాల ఏర్పాటు చేయలేదని వారు చెబుతున్నారు. జీవీఎంసీ ట్రేడ్ లైసెన్స్‌లు ఇవ్వకపోవటంతో తాము తమ దుకాణాలను అవసరం మేరకు ఆధునికీకరణ.. చిన్నచిన్న మార్పులు చేసుకోలేకపోతున్నామని వ్యాపారులంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ట్రేడ్ లైసెన్స్‌లు ఇస్తే వెంటనే దుకాణాలకు కావాల్సిన హంగులు సమకూర్చుకుంటామని వ్యాపారులు చెబుతున్నారు. అలాగే తమకు కనీస వసతులు కూడా కల్పించాలని వారు కోరుతున్నారు.

స్పందన లేదు..



మార్కెట్‌లోని వ్యాపారులందరం ట్రేడ్ లైసెన్స్‌ల కోసం జీవీఎంసీ అధికారులను అడుగుతూనే ఉన్నాం. ఇప్పటికే జీవీఎంసీకి వెళ్లి దరఖాస్తు చేసుకున్నాం. అయినా ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేయలేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే వ్యాపారులందరికీ ట్రేడ్ లైసెన్స్‌లు ఇవ్వాలి.
– నాయిని సూర్యనారాయణ, మార్కెట్ ప్రెసిడెంట్

కనీస వసతులు లేవు..



ట్రేడ్ లైసెన్స్‌లు జారీ అయితే మాకు పూర్తి హక్కు వస్తుంది. అలాగే దుకాణాలకు కావాల్సిన కనీస వసతులు ఏర్పాటు చేసుకోగలుగుతాం. షట్టర్లు, విద్యుత్ ఇతర సౌకర్యాలు ఏర్పాటు కావాల్సి ఉంది. ముఖ్యంగా షట్టర్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో దొంగతనాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేయాలి. –భూషణం, వ్యాపారి

ఆక్రమణలతో అవస్థలు

- పాత బస్టాండ్ రోడ్డులో రహదారిపైనే వ్యాపార లావాదేవీలు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు

జగదాంబ: పాత బస్టాండ్ రోడ్డు ఆక్రమణలకు గురికావటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. జీవీఎంసీ 35వ వార్డులో ఏవీఎన్ కళాశాల నుంచి పాత బస్టాండ్ మీదుగా వెళ్లే రహదారి ఆక్రమణలతో రాకపోకలకు వీల్లేకుండా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇక్కడ దుకాణదారులు రోడ్డును ఆక్రమించుకుని తాము తయారు చేసిన కర్ర సామగ్రి రోడ్డుపైనే పెట్టుకుంటున్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆ ప్రాంతీయులు చెబుతున్నారు. 30 అడుగుల ఈ రోడ్డు ఆక్రమణల కారణంగా కేవలం ఎనిమిది అడుగులకే పరిమితం అయిందని వాపోతున్నారు. ఈ రోడ్డు ఆక్రమణకు గురి కావటంతో ఇక్కడి ప్రధాన కాలువను శుభ్రం చేయలేకపోతున్నట్లు పారిశుధ్య కార్మికులు చెబుతున్నారు.



పాత బస్టాండ్ రోడ్డులో రహదారిపై పేర్చిన చెక్క సామగ్రి

దీంతో మురుగు, చెత్త, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. దీనికి తోడు రహదారి పక్కన కొత్తగా దుకాణాలు ఏర్పడటం వల్ల మరిన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి రహదారిపై ఆక్రమణలు తొలగించాలని.. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆధ్యాత్మిక సేవలో పాల్గొనటం అదృష్టం

అల్లిపురం: ఆధ్యాత్మిక సేవలో పాల్గొనటం తన అదృష్టమని, అన్నదాన కార్యక్రమంలో భాగస్వామిని కావటం ఆనందంగా ఉందని ప్రముఖ వ్యాపారవేత్త గూడెల నాని అన్నారు. కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల శ్రీ రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ గౌరవాధ్యక్షుడు పీలా వెంకట అప్పలనాయుడు, అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు, ముఖ్య సలహాదారు బొడ్డేటి ప్రసాద్, కమిటీ సభ్యులు పంపాన గణేష్, వాసుపల్లి నారాయణ, బడే నాగరాజు, గణగళ్ల సత్యవతి, కామేశ్వరశర్మ, పాకలపాటి అప్పారావు ఆహ్వానం పలికారు. అమ్మవారికి విశేష పూజల అనంతరం ఆయన అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు.



అన్నప్రసాదం వడ్డిస్తున్న గూడెల నాని, ఆలయ ప్రతినిధులు

కలెక్టర్‌కు రెడ్‌క్రాస్ ప్రతినిధుల అభినందన

మహారాణిపేట: కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌ను ఇండియన్ రెడ్‌క్రాస్ అధ్యక్షుడు వై.శివనాగేంద్రరెడ్డి, కార్యదర్శి రవికుమార్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రెడ్‌క్రాస్ మేనేజర్ రావు తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌ను అభినందిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

విశాఖ వాసికి బిజినెస్ ఎక్స్‌లెన్స్ అవార్డు

దాబాగార్డెన్స్: స్విఫ్ట్ ఎన్ లిఫ్ట్ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణలో నిర్వహించిన బిజినెస్ అవార్డుల్లో నగరానికి చెందిన గంటా సిరి వర్షిణికి బిజినెస్ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. ఈవెంట్ మేనేజ్‌మెంట్ అండ్ కొరియోగ్రఫీ విభాగంలో లోర్నాస్ ఈవెంట్ అధినేత గంటా సిరి వర్షిణి తెలంగాణ బిజినెస్ ఎక్స్‌లెన్స్–2024 అవార్డును సినీ నటి భూమిక చేతుల మీదుగా అందుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ ప్రాంతాల్లో సమాజానికి అవసరమైన కార్యక్రమాలు, ఈవెంట్ల నిర్వహణలో భాగంగా ఈ అవార్డు తనకు లభించడం సంతోషకరమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు సాధించేందుకు కృషి చేస్తానన్నారు.



సినీ నటి భూమిక చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సిరివర్షిణి

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో 32 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

శివనగర్ యూపీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

మహారాణిపేట: మద్రిపాలెం శివనగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (యూపీహెచ్‌సీ) గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. ఆరోగ్య కేంద్ర సిబ్బందికి జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ కోసం పలు సూచనలిచ్చారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను పరిశీలించి, కూలర్‌ను పరీక్షించి సూచనలు చేశారు. డీఎంహెచ్‌వో సమక్షంలోనే కొంతమంది మధుమేహం, టీబీ వ్యాధిగ్రస్తులకు వ్యాక్సిన్లు వేశారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమం జిల్లాలో ఏ విధంగా జరుగుతుందో పర్యవేక్షించడానికి జిల్లా ప్రోగ్రాం అధికారులు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, నోడల్ అధికారి బి.ఉమావతి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సమత వివిధ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి సిబ్బందికి టీకా వేసే విధానం, వ్యాక్సిన్‌లో సిక్స్ ప్రియారిటీస్‌ను వివరించారు. లబ్ధిదారులకు వ్యాక్సినేషన్‌పై ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, సీ–సెక్షన్ ప్రసవాలను నివారించాలని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు అన్నారు. ఆరోగ్య సిబ్బంది అందరు సమయపాలన పాటించాలని, ముఖ్యంగా స్టాప్ డయేరియా కార్యక్రమం మీద ప్రజలందరికీ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, వర్షా కాలంలో కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని చెప్పారు. జిల్లా ప్రోగ్రాం అధికారులు, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

ఇంటిని తలపించేలా విద్యార్థులకు భోజనాలు పెట్టాలి

కంచరపాలెం: ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు ఇంటిని తలపించేలా పరిశుభ్ర వాతావరణంలో మధ్యాహ్న భోజనం అందించాలని గోపాలపట్నం మండల విద్యా శాఖాధికారి–2 డి.దివాకర్ సూచించారు. ప్రభుత్వ బడుల్లో బురదలో భోజనాలు శీర్షికన ఇటీవల అనేక కథనాలు రాష్ట్రంలో సంచలం రేపడంతో విశాఖ జోన్–2 ఆర్‌జేడీ విజయ భాస్కర్, జిల్లా విద్యా శాఖాధికారి చంద్రకళ ఆదేశాల మేరకు గురువారం కప్పరాడ జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఎంఈవో పర్యటించారు. మధ్యాహ్న భోజనాలు తినే ప్రాంతాలను పరిశీలించారు. డైనింగ్ హాల్‌లోనే విద్యార్థులకు భోజనాలు వడ్డించాలన్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆరుబయట భోజనాలు చేయరాదని ఆయా పాఠశాలల హెచ్ఎంలు విజయమాలిని, సుధాలకు సూచించారు. విద్యార్థులు బయట భోజనాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో దివాకర్ హెచ్చరించారు. మధ్యాహ్న భోజనాలు చేసే ముందు చేతులు శుభ్రంగా కడుక్కునేలా ఉపాధ్యాయులు విధిగా విద్యార్థులపై ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.



కప్పరాడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈవో దివాకర్

అల్లూరి పోరాట పటిమ గర్వకారణం

విప్లవ వీరుడు అల్లూరి జయంతిని నాయకులు, సంఘాల ప్రతినిధులు, అసోసియేషన్ల నేతలు ఘనంగా నిర్వహించారు. అతి చిన్న వయసులోనే బ్రిటిష్ వారిని గడగడలాడించిన అల్లూరి పోరాట స్ఫూర్తిని నేటి యువత పుణికి పుచ్చుకుని ముందడుగు వేయాలని తెలిపారు. ఈ సందర్భంగా అల్లూరికి ఘనంగా నివాళులు అర్పించారు.

- విప్లవ వీరుడు అల్లూరికి పలువురి నివాళి
- ఆయన స్ఫూర్తి ఎనలేనిదని కొనియాడిన వక్తలు



దాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రక్తదానం చేస్తున్న దాతలు



కేంద్ర గ్రంథాలయంలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది, పాఠకులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల



విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్, ద్రోణంరాజు శ్రీవత్సవ్

దాబాగార్డెన్స్: అల్లూరి జయంతిని పురస్కరించుకుని డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సిటు విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని డీసీపీ–1 బి. లక్ష్మీనారాయణ, ఈస్ట్ ఏసీపీ జయరాం ప్రసాద్, లయన్స్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ దుర్గాప్రసాద్ ప్రారంభించారు. క్యాబ్, మున్సిపల్, ఆటో, బిల్డింగ్ తదితర 45 మంది అసంఘటిత రంగ కార్మికులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సిటు నాయకులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, కుమార్ మంగళం, పి. మణి, అప్పలరాజు, లక్ష్మణమూర్తి, వెంకట్రావు, నరేంద్ర కుమార్, అప్పారావు, యు. రాజు, నూకరాజు, చంద్రమౌళి, కృష్ణారావు, ఎం. సుబ్బారావు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర గ్రంథాలయంలో..

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అల్లూరి జయంతి నిర్వహించారు. విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు, ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ పీవీ నూకరాజు, అసిస్టెంట్ లైబ్రేరియన్ ఇన్‌చార్జి రాజేంద్ర వర్మ, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల, పలువురు అధ్యాపకులు పాల్గొని అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి, కార్యక్రమ నిర్వాహకురాలు బి. రాధమ్మ, ఎన్‌వీ పద్మకుమారి, డాక్టర్ జె. లావణ్య, అనురాధ, హైమావతి, జె. జ్యోతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద సంస్థలో..

పాతనగరంలో గల స్వామి వివేకానంద సంస్థలో అల్లూరి జయంతి నిర్వహించారు. సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్‌తో పాటు సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొని అల్లూరి చిత్రటం వద్ద నివాళులర్పించారు. ట్యూషన్ పిల్లలకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టి. కృష్ణ, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హక్కుల కోసం పోరాడిన యోధుడు అల్లూరి..

మహారాణిపేట : గిరిజనుల హక్కుల కోసం అల్లూరి సీతారామరాజు ఎంతో కృషి చేశారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అన్నారు. గురువారం జిల్లా పరిషత్‌లో అల్లూరి జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో ఎం.పోలినాయుడు, డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ, విశ్రాంత పరిపాలనాధికారి పీవీఎన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర తదితరులు

పోరాట యోధునికి ఘన నివాళి



ఏవీఎన్ కళాశాలలో గల అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

దాబాగార్డెన్స్ : స్వాతంత్ర్య సమరంలో అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం దేశానికే గర్వకారణమని ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు కొనియాడారు. మన్యం వీరుడు, ఏవీఎన్ పాఠశాల పూర్వ విద్యార్థి అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని కళాశాల ప్రాంగణంలో గల అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అల్లూరి ఏవీఎన్ కళాశాల విద్యార్థి కావడం కళాశాలకు గర్వకారణమన్నారు. ఆయన పోరాటాలను భారత ప్రభుత్వం గుర్తించి గత ఏడాది శత జయంతి వేడుకలు నిర్వహించిందన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎ. అర్చన నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి. కృష్ణకుమారి, కళాశాల డీన్ జి. శంకర నారాయణ, ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ జె. రామారావు, డాక్టర్ జి. సునీత, పి. గాంధీ, ఎం. స్వరాజ్యలక్ష్మి, పైడి రజని, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఓమ్ని ఆర్కే హాస్పిటల్ సిబ్బంది సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి, భక్తులు, పేదలకు వైద్య పరీక్షలు చేశారు. సుమారు 100 మందికి బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం మధ్యాహ్న హారతి, అన్నదానం నిర్వహించారు. సాయంత్రం మహిళా భక్తుల చేతుల మీదుగా పల్లకీ సేవ, బాబా భజన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాల్లో ఓమ్ని ఆర్కే ఆస్పత్రి సిబ్బంది గౌరినాయుడు, చంటి, భాగ్య, ధ్యాన మందిర కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న ఆస్పత్రి సిబ్బంది